సంపుటి : 9
సంచిక : 325
సోమవారం
17 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

E-PAPER

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

# చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం



**చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన**

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం**

**డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు**

**పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ**

**పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం**

**చంద్రగిరి, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్ర వారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తరువాయి.. 2లో..

# విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'

**వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం**

**ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక - ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు**

**కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన**




**విజయవాడ, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యా యులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు..

# 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?

**తెలంగాణా రాష్ట్ర ముఖ్యమమంత్రి రేవంత్‌రెడ్డి**



**ములుగు, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడారంలో వనదేవతలను బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లాలో సీఎం పర్యటించారు. తొలుత మేడారంలో పర్యటించిన సీఎం.. వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు చేరుకుని గట్టమ్మ దేవాలయం వద్ద హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. "ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మొదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలు తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి తరువాయి.. 2లో..

# తిరుమలకు పోటెత్తిన భక్తులు

**వరుస సెలవులు.. తిరుమలలో భారీ రద్దీ.. దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ**

**శ్రీవారి సర్వదర్శనానికి 22 గంటల సమయం**

**నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు**

**శనివారం 90 వేల మందికి పైగా స్వామివారి దర్శనం**




**తిరుమల, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు తరువాయి.. 2లో..

మోదీ ఫొటో కావాలంటే

# సన్నబియ్యం డబ్బులివ్వండి

**తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరువాయి.. 2లో..

హైదరాబాద్-అమరావతి.. పక్కపక్కనే హైస్పీడ్ రైల్..

# 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే!

**హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు, ఫ్యూచర్ సిటీ-బందరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం**

**రెండు ప్రాజెక్టులు ఒకదానికొకటి సమాంతరంగా నిర్మాణం**

**రెండు మార్గాలకు కలిపి ఒకేసారి భూసేకరణ చేపట్టేందుకు ప్రణాళిక**

**ఫ్యూచర్ సిటీ, అమరావతి, బందరు పోర్టు మధ్య కనెక్టివిటీ బలోపేతం**

**ఎడమవైపు రోడ్డు, కుడివైపు రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు**




**హైదరాబాద్, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, బందరు పోర్టులను అనుసంధానించేలా రెండు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సమాంతరంగా పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్వే లైన్, ఫ్యూచర్ సిటీ-బందరు పోర్టు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను పక్కపక్కనే నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా అంగీకరించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, హైదరాబాద్-విజయవాడ ప్రస్తుత జాతీయ రహదారికి ఎడమవైపు ఎక్స్‌ప్రెస్‌వే, కుడివైపు హైస్పీడ్ రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు.

**760 కిలోమీటర్ల హైస్పీడ్ రైలు మార్గం**

హైదరాబాద్-అమరావతి-చెన్నై మధ్య తరువాయి.. 2లో..

మాజీ ప్రధాని వాజ్‌పేయికి

# మంత్రి లోకేష్ నివాళి



**అమరావతి, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సం దర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ తన పోస్టులో వాజ్‌పేయి సేవలను కొనియాడారు. "భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘననివాళులు అర్పిస్తున్నాను. దేశం ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణపరంగా అభివృద్ధి చెందడంలో వాజ్ పేయి కీలకపాత్ర పోషించారు. దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకస్థానం తరువాయి.. 2లో..

సోనియా గాంధీ దేశ ప్రజలకు

# క్షమాపణ చెప్పాలి : అమిత్ షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శలు గుప్పించారు. శనివారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ కళ్లారా చూశారని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని మండిపడ్డారు. ఆ పార్టీని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని అన్నారు. వందేమాతరాన్ని అవమానించినందుకు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు సిగ్గుచేటని విమర్శించారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**పోలీసుల అదుపులో విద్యార్థులు..**

అమిత్ షా పర్యటనకు ముందు కాంగ్రెస్ నాయకులతో పాటు తరువాయి.. 2లో..

# అస్సాం సీఎంకు బెదిరింపు.. నిందితుడి అరెస్టు

**అస్సాం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** రూ.కోటి ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను హత్య చేస్తానని సామాజిక మాధ్యమంలో బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గువాహటిలోని ఖానాపారా వెటర్నరీ అండ్ అగ్రికల్చరల్ మైదానంలో సీఎం హిమంత బిశ్వ శర్మ శుక్రవారం మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం అవుతుండగా.. లైవ్ చాట్ సెక్షన్‌లో సదరు వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ చాట్‌లో తరువాయి.. 6లో..

# మురుగు కాలువలో బంగారునాణేలు



**ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** భూగర్భ పైపులను మారు స్తుండగా భారీగా బంగారు నాణేలు, గోల్డ్ బార్స్ దొరికాయి. వాటి విలువ దాదాపు రూ.98 కోట్లు ఉంటుందని అంచనా. ఈ ఘటన బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో తరువాయి.. 2లో..

మెడికో ప్రియాంక మృతి కేసులో కీలక పరిణామం..

# దర్యాప్తుకు ప్రత్యేక ఐపీఎస్ అధికారి

- రాజమండ్రి వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం
- విచారణాధికారిగా ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్‌ను నియమించిన ప్రభుత్వం
- ప్రియాంక కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు
- నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- మద్యం మత్తులో యువకులు కారుతో ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయిన ప్రియాంక



**రాజమహేంద్రవరం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలో వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఐపీఎస్ అధికారి, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మునీష్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ దర్యాప్తులో ఏఎస్పీకి సౌత్ డీఎస్పీ శివప్రియ, ప్రకాశంనగర్ సీఐ బాజీలాల్ సహకరించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర దిగ్భ్రాంతి తరువాయి.. 2లో..

# ఎడిటర్ వాయిస్

## జనగణన 2027
## దేశవ్యాప్తంగా 40 ప్రశ్నలు

భారత్‌లో జనగణన 2027కు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈసారి జనగణనలో ప్రజల జనాభా వివరాలతో పాటు విద్య, ఉపాధి, వలసలు, బ్యాంకు ఖాతాలు, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలపై కూడా సమాచారం సేకరించనున్నారు. మొత్తం 40 ప్రశ్నల ద్వారా ప్రతి వ్యక్తికి సంబంధించిన వివిధ వివరాలను నమోదు చేయనున్నారు. వ్యక్తి పేరు, కుటుంబంలో సంబంధం, లింగం, పుట్టిన తేదీ, వయసు, వైవాహిక స్థితి వంటి ప్రాథమిక వివరాలతో ప్రక్రియ ప్రారంభమవుతుంది. వివాహితుల విషయంలో వివాహ వయసు, జీవిత భాగస్వామి పేరు వంటి వివరాలను కూడా నమోదు చేస్తారు. అలాగే వ్యక్తి ప్రకటించిన జాతీయత, మతం, ఎస్సీ/ఎస్టీ/కుల వివరాలు, తల్లిదండ్రుల వివరాలను కూడా సేకరిస్తారు.

**విద్య, ఉద్యోగంపై ప్రత్యేక వివరాలు**

జనగణనలో విద్యకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వ్యక్తి అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, విద్యాసంస్థకు హాజరవుతున్నారా లేదా ఇప్పటివరకు సాధించిన అత్యున్నత విద్యార్హత, చదివిన కోర్సు లేదా విభాగం వంటి వివరాలు అడుగుతారు. ఉపాధి విషయంలో గత ఏడాదిలో ఎప్పుడైనా పని చేశారా, ఆర్థిక కార్యకలాపాల వర్గం, వృత్తి, పరిశ్రమ/వ్యాపారం/సేవ రంగం, కార్మికుల వర్గం వంటి అంశాలను నమోదు చేస్తారు. పని చేయని లేదా పరిమితంగా పనిచేసే వ్యక్తుల విషయంలో వారు చేస్తున్న ఆర్థికేతర కార్యకలాపాలు, ఉద్యోగం కోసం చూస్తున్నారా లేదా అందుబాటులో ఉన్నారా అనే వివరాలను కూడా తెలుసుకుంటారు.

**వలసలు, నివాస వివరాలు**

వ్యక్తి పుట్టిన ప్రదేశం, చివరిగా నివసించిన ప్రాంతం, వలస రావడానికి కారణం, ప్రస్తుత గ్రామం లేదా పట్టణంలో ఎంతకాలంగా ఉంటున్నారు, శాశ్వత నివాస చిరునామా వంటి వివరాలను కూడా సేకరిస్తారు. పని చేసే ప్రదేశానికి ఎలా ప్రయాణిస్తున్నారనే అంశం కూడా ప్రశ్నల్లో ఉంటుంది.

**కుటుంబం, ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు**

ప్రస్తుతం వివాహితులు, వితంతువులు, విడాకులు పొందిన వారు లేదా విడిపోయిన మహిళల విషయంలో ప్రస్తుతం జీవించి ఉన్న పిల్లల సంఖ్య, ఇప్పటివరకు జన్మించిన పిల్లల సంఖ్య వంటి వివరాలను నమోదు చేస్తారు. ప్రస్తుతం వివాహిత మహిళలకు గత ఏడాది జన్మించిన పిల్లల సంఖ్యను కూడా అడుగుతారు. దివ్యాంగులకు సంబంధించిన వివరాలతో పాటు కొవిడ్-19 వ్యాక్సినేషన్ ఎక్కడ పొందారనే సమాచారాన్ని కూడా సేకరించనున్నారు.

**బ్యాంకు ఖాతాల నుంచి గుర్తింపు పత్రాల వరకు..**

ఈసారి జనగణనలో ఆర్థిక, డిజిటల్ వివరాలకు కూడా చోటు కల్పించారు. వ్యక్తికి ఉన్న మొత్తం బ్యాంకు ఖాతాల సంఖ్య, అందుబాటులో ఉంటే మొబైల్ నంబర్‌ను నమోదు చేయనున్నారు. అలాగే ఆధార్ నంబర్, ఓటర్ ఐడీ, భారతీయ పాస్‌పోర్ట్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉన్నాయా? అనే వివరాలను కూడా సేకరించే ప్రశ్నలు ఉన్నాయి. ఇవన్నీ అందుబాటులో ఉంటేనే నమోదు చేసే విధంగా ప్రశ్నలను రూపొందించారు. మొత్తంగా జనగణన 2027లో కేవలం జనాభా లెక్కలు మాత్రమే కాకుండా.. దేశ ప్రజల సామాజిక, విద్యా, ఆర్థిక, ఉపాధి, వలస, డిజిటల్ , గుర్తింపు సంబంధిత వివరాలపై విస్తృత సమాచారాన్ని సేకరించేందుకు 40 ప్రశ్నలను ఉపయోగించనున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

కాల్వలోకి దూసుకెళ్లిన కారు..

## నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి



**తణుకు, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఇరగవరం మండలం అయితంపూడి లాకుల సమీపంలో ఆదివారం ఉదయం అదుపు తప్పిన కారు నరసాపురం పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రానికి నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి కోసం గాలిస్తున్నారు. ఈ ప్రమాదంలో కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మీభానువికాస్ (18), నాగిరెడ్డి దుష్యంత్ సాయి(18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురంలోని చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలోని చింతపర్రుకి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) గల్లంతయ్యారు. ఆచంట మండలం వల్లూరుకి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయటపడ్డాడు.

**కొనసాగుతున్న గాలింపు**

వీరంతా పెరవలిలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పెరవలి నుంచి నరసాపురం బయలుదేరగా మార్గంమధ్యలోని ఓగిడిలో స్నేహితుడిని కలిశారు. అక్కడి నుంచి అయితంపూడి మీదుగా వెళ్తుండగా నరసాపురం వైపు తిరిగే క్రమంలో లాకుల వద్ద కారు అదుపు తప్పి ఎదుట పంట కాలువలోకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో వర్షం పడుతుండగా ప్రయాణ సమయంలో ఎదురుగా ఉన్న కాలువను గమనించకపోవడంతో కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కాలువలో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో ప్రవాహ వేగానికి కారు సుమారు 100 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. సంతోష్ చెట్టు కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు కాపాడారు. హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా అయితంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుష్యంత్ సాయి, మార్టేరు సమీపంలో సాయిసూర్యతేజ మృతదేహాలు దొరికాయి. రాజారాం చరణ్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. చరణ్ మినహా మిగిలిన వారంతా నరసాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అందరూ 20ఏళ్లలోపు యువకులే కావడంతో ఇరు జిల్లాల్లోనూ విషాదచాయలు అలుముకున్నాయి.

భవనం పైనుంచి దూకి

## వైద్య విద్యార్థి ఆత్మహత్య



**ఉప్పల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని ఉప్పల్ పీఎస్ పరిధిలో వైద్యవిద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రామంతాపూర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి దూకి కొల్కూరి భరద్వాజ్ (18) బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఉస్మానియా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు దిగి పట్టాలు దాటుతుండగా..

## మరో రైలు ఢీకొని యువతి మృతి



**రెజిమెంటల్ బజార్, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లిదండ్రులతో కలిసి రైలు దిగి పట్టాలు దాటుతుండగా.. మరో రైలు ఢీకొన్న ఘటనలో ఓ యువతి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మౌలాలి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్ గౌడ్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా నేరేడుమెట్లకు చెందిన ప్రకాశ్, జ్యోతి దంపతులు కొంతకాలంగా మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె మానస (20) నెల రోజుల క్రితమే నర్సు శిక్షణ పూర్తి చేసుకుంది. కుటుంబ సభ్యులు కలిసి జనగామలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి.. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. మౌలాలి రైల్వేస్టేషన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి రైలు దిగిన మానస.. రెండో నంబరు ప్లాట్‌ఫాం నుంచి 1వ నంబరుకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో దూసుకొచ్చిన విశాఖ- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. రెప్పపాటులో జరిగిన ఈ విషాద ఘటనతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు
కాకినాడ జిల్లా | తూర్పు గోదావరి జిల్లా | డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా
సోమవారం, 17 ఆగస్టు, 2026
www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


# వాజ్ పేయి లాంటి లీడర్.. బీజేపీకి కూడా మళ్ళీ దొరకరు!


నిజానికి ఒక్క ఓటు కాదు పదుల ఓట్లు లేకపోయినా తెచ్చి అధికారం నిలబెట్టుకునే రాజకీయ సామర్థ్యం ఉన్న నేతల రోజులు ఇవి. అటల్ బిహారీ వాజ్ పేయి దేశంలో వరిష్ట నేత, విశిష్ట నాయకుడు. అజాత శత్రువు. అధికారంలో ఉంటే ప్రతిపక్షం మెప్పు పొందుతారు, ప్రతిపక్షంలో ఉంటే అధికార పక్షం ఆయన పట్ల ఎంతో గౌరవం ప్రదర్శిస్తుంది. ఆరున్నర దశాబ్దాల రాజకీయ జీవితం ఆయనది. 71 ఏళ్ళ వయసులో తొలిసారి భారత దేశానికి కాషాయం పార్టీ తరఫున ఆయన తొలిసారి ప్రధాని అయ్యారు. 1996 మే 15న ఆయన ప్రధానిగా ప్రమాణం చేసి కేవలం 13 రోజులు మాత్రమే అధికారంలో ఉన్నారు. మెజారిటీ లేక దిగిపోయారు. 1998లో నెగ్గినా 13 నెలలకే ఆయన ప్రభుత్వం కుప్ప కూలింది. ఇక్కడ ఒక్క ఓటు తేడాతో ఆయన ప్రభుత్వం పడిపోవడం జరిగింది.

**ఆయన చలవతోనే :**

నిజానికి ఒక్క ఓటు కాదు పదుల ఓట్లు లేకపోయినా తెచ్చి అధికారం నిలబెట్టుకునే రాజకీయ సామర్థ్యం ఉన్న నేతల రోజులు ఇవి. అలాంటి వారికి వాజ్ పేయి ఒక వింతగా విశేషంగా కనిపిస్తారు. అయితే ఆయన నిబద్ధత నిజాయతీని చూసి దేశమంతా 1999 నవంబర్ లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే పక్షాన నెగ్గించి అధికారం చేతిలో పెట్టింది. అలా 2024 మే దాకా ఆయన సుమారు అయిదేళ్ళ పాటు పాలించారు. మొత్తంగా వాజ్ పేయి ప్రధానమంత్రి త్వం ఆరున్నరేళ్ళ పాటు సాగింది. నిజానికి బీజేపీకి కేంద్రంలో అధికారం అంటే వాజ్ పేయి చలవతోనే అని చెప్పాలి. ఆయన ఉదారవాది. నిజాయతీపరుడు, రాజనీతిజ్ఞుడు, రాజధర్మం ఏంటో తెలిసిన వారే కాదు పక్కాగా అమలు చేసిన వారు కూడా.

**నెహ్రూ జోస్యం నిజమైంది :**

వాజ్ పేయి 1957 లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి గెలిచి నాటి జనసంఘ్ సభ్యుడిగా లోక్ సభలో అడుగు పెట్టారు. జనసంఘ్ కి ఆనాడు ఇద్దరో ముగ్గురో ఎంపీలు ఉండేవారు. అపుడు ఆయన వయసు 32 ఏళ్ళు. అయితే ఈ యువ పార్లమెంటేరియన్ దేశంలోని అన్ని సమస్యలను ఏకరువు పెడుతూ బలమైన ప్రధాని దేశానికి తొలి ప్రధాని అయిన పండిట్ నెహ్రూనే సూటిగా ప్రశ్నించేవారు. అయితే విపక్షంలో కనీస బలం కూడా లేని జన సంఘ్ పార్టీ కదా అని నెహ్రూ చులకనగా చూడలేదు, వాజ్ పేయి మాట్లాడడానికి ఎన్నో అవకాశాలు ఇచ్చారు. ఆయన పార్టీకి ఉన్న సంఖ్యా బలం కంటే కూడా అధిక సమయం



కేటాయించేలా చూసేవారు. అంతే కాదు యువ వాజ్ పేయి అడిగే ఎన్నో ప్రశ్నలకు ప్రధాని స్థాయిలో నెహ్రూ ఓపికగా జవాబులు చెప్పేవారు. ఇక వాజ్ పేయి రాజకీయ పరిణతి చూసి ఏదో రోజున దేశానికి ప్రధాని అవుతారని కూడా నెహ్రూ జోస్యం చెప్పారు. అది తరువాత కాలంలో నిజమైంది కూడా.

**ఇందిరాగాంధీ సైతం :**

అంతే కాదు ఉక్కు మహిళ ఇందిరాగాంధీ సైతం వాజ్ పేయిని ఎంతోగానో గౌరవించడమే కాదు ఆయన సలహా సూచనలు తీసుకునే వారు. 1972 సమయంలో పాకిస్థాన్ తో సిమ్లా ఒప్పందం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. దానిని ప్రతిపక్షంలో ఉన్న వాజ్ పేయి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంలో వాజ్ పేయిని కన్విన్స్ చేసేందుకు ఇందిరాగాంధీ ఒకసారి ఆయనకు ఫోన్ చేసి చర్చలకు రమ్మని పిలిచారు. వాజ్ పేయి వెళ్ళాక ఇద్దరూ ఇదే విషయం మీద చర్చించుకున్నారు. అయినా సరే వాజ్ పేయి తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు, ఇందిర సైతం వాజ్ పేయి అభిప్రాయం ఎలా ఉన్నా కూడా సిమ్లా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక్కడ చెప్పాల్సింది వాజ్ పేయిని ఆయన అభిప్రాయాలను అంతలా అధికార పార్టీలు గౌరవించాయని చెప్పడమే. రాజీవ్ గాంధీ సైతం వాజ్ పేయి పట్ల అదే ఆదరణ గౌరవం చూపించారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయిని ఐక్యరాజ్యసమితికి వెళ్లే భారతీయ ప్రతినిధి బృందంలో సభ్యుడిగా చేర్చారు.

**రాజధర్మం అన్న మాట :**

ఇక వాజ్ పేయి ప్రధాని గా ఉండగా ఎక్కువగా ఒక మాట వినిపించేది. అదే రాజ ధర్మం. అంటే అధికారంలో ఎవరు ఉన్నా తమ తర భేదం లేకుండా అందరినీ సమానంగా చూడడం. ఆ సమయంలోనే గుజరాత్ అల్లర్ల సందర్భంగా తన సొంత పార్టీ ప్రభుత్వం మీద విమర్శలు వచ్చినపుడు చర్యలకు వాజ్ పేయి ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. 2002 ఏప్రిల్ లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ, పాలకుడు కుల, మత, జాతి బేధాలు చూడకుండా ప్రజలను రక్షించడమే నిజమైన రాజధర్మమని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు రాజధర్మాన్ని పాటించాలని, పౌరులందరికీ భద్రత కల్పించాలని ఆయన హితవు పలికారు.

**స్ఫూర్తి దాతగా :**

వాజ్‌పేయి తీసుకున్న విధానం రాజధర్మం అంటే నిష్పాక్షికమైన పాలన అని ఆయన ఆచరణలో చూపించారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని ఆయన భావించారు.కష్టకాలంలోనూ మానవతా విలువలకు, సమన్యాయానికి పెద్దపీట వేయాలని ఆయన నాయకులకు గుర్తుచేశారు. మరి అలాంటి నాయకులు ఈ తరంలో కనిపిస్తారా. వాజ్ పేయి వంటి నాయకుడు బీజేపీకి కూడా మళ్ళీ దొరకడం కష్టం అంటే అది నిజమే కదా అనిపిస్తుంది. 93 ఏళ్ళ పరిపూర్ణ జీవితాన్ని చూసిన వాజ్ పేయి 2018 ఆగస్టు 16న ఈ భువిని వీడి దివికేగారు. ఈ రోజు ఆయన వర్ధంతి సందర్భంగా అంతా నివాళి అర్పిస్తున్నారు.

# సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

## జయంతి సందర్భంగా నివాళులర్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమలాపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** అణగారిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని, గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన గౌతు లచ్చన్న జీవితాంతం సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల సాధన కోసం ఆయన చేసిన ఉద్యమాలు నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వం, న్యాయం కోసం గౌతు లచ్చన్న చూపిన మార్గాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సూచించారు. సమాజ అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్దార్ గౌతు లచ్చన్న వంటి మహనీయుల జీవిత చరిత్రలు భావితరాలకు మార్గదర్శకాలని, సమాజంలో వెనుకబడిన వర్గాల సాధికారత కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య, గన్నవరం నియోజకవర్గం టూ మెన్ కమిటీ సభ్యులు మోకా ఆనంద సాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ, అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రులు కూతురికి ఇచ్చే

# ఆస్తిపై ట్యాక్స్ ఉంటుందా?

కూతురికి తల్లిదండ్రులు ఆస్తి లేదా ఆభరణాలు ఇస్తే దానిపై ఆదాయపు పన్ను చెల్లించాలా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ముఖ్యంగా పిల్లల పేరుతో ఆస్తులు బదిలీ చేసే సమయంలో పన్ను నిబంధనలు తెలుసుకోవడం చాలా ముఖ్యం. అయితే ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొన్ని కుటుంబ సంబంధాల మధ్య ఇచ్చే బహుమతులకు ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. తల్లిదండ్రులు తమ కూతురికి నగదు, ఆభరణాలు, స్థిరాస్తి లేదా ఇతర విలువైన ఆస్తులను గిఫ్ట్‌గా ఇస్తే, సాధారణంగా ఆ బహుమతిపై కూతురు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆదాయపు పన్ను చట్టంలోని 'రిలేటివ్' నిర్వచనం ప్రకారం తల్లిదండ్రులు, పిల్లలు, భార్య లేదా భర్త, తోబుట్టువులు, తాతలు, మనవళ్లు, మనవరాళ్లు వంటి నిర్దిష్ట బంధువుల నుంచి వచ్చే బహుమతులకు పన్ను మినహాయింపు ఉంటుంది. అంటే తల్లిదండ్రులు కూతురి పేరుపై ఇంటి స్థలం, ఇల్లు, వ్యవసాయ భూమి, బంగారు ఆభరణాలు లేదా ఇతర ఆస్తులను బహుమతిగా బదిలీ చేసినప్పుడు కేవలం ఆ బహుమతి అందుకున్నందుకు కూతురిపై ఆదాయపు పన్ను విధించరు. అయితే ఆస్తిని చట్టబద్ధంగా బదిలీ చేయడానికి అవసరమైన గిఫ్ట్ డీడ్, రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వంటి అంశాలు మాత్రం రాష్ట్ర నిబంధనల ప్రకారం వర్తించవచ్చు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. తల్లిదండ్రుల నుంచి ఆస్తి గిఫ్ట్‌గా వచ్చిన తర్వాత దాని ద్వారా ఆదాయం వస్తే మాత్రం పన్ను నిబంధనలు వర్తించవచ్చు. ఉదాహరణకు కూతురు ఆ ఇంటిని అద్దెకు ఇచ్చి రెంట్ పొందితే ఆ అద్దె ఆదాయం పన్ను పరిధిలోకి రావచ్చు. అలాగే ఆస్తి నుంచి వచ్చే ఇతర ఆదాయాలు, వడ్డీ వంటి వాటిపైనా సంబంధిత పన్ను నిబంధనలు వర్తిస్తాయి. అయితే స్నేహితులు లేదా చట్టపరంగా 'రిలేటివ్' పరిధిలోకి రాని వ్యక్తుల నుంచి వచ్చే బహుమతులకు వేరే నిబంధనలు ఉంటాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు లేని వ్యక్తుల నుంచి అందుకున్న బహుమతుల మొత్తం విలువ ?50,000 దాటితే నిర్దిష్ట పరిస్థితుల్లో మొత్తం బహుమతి విలువనే ఆదాయంగా పరిగణించి పన్ను విధించే అవకాశం ఉంటుంది. అందువల్ల కూతురికి తల్లిదండ్రులు ఆస్తి ఇవ్వడం సాధారణంగా ఆదాయపు పన్ను పరంగా సమస్య కాదు. అయితే పెద్ద మొత్తంలో ఆస్తి బదిలీ చేసే ముందు గిఫ్ట్ డీడ్, రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, భవిష్యత్‌లో ఆస్తిని విక్రయించినప్పుడు వచ్చే క్యాపిటల్ గెయిన్స్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పెద్ద విలువైన ఆస్తుల విషయంలో పన్ను నిపుణుడి సలహా తీసుకోవడం మంచిది.

# ఈ మొబైల్‌ల వల్లే కాపురాలు కూలుతున్నాయా? గరికపాటి కీలక వ్యాఖ్యలు!

ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ప్రవచనాలు వింటున్నారు. తన మాటలతో సమాజంలో కాస్తైనా మార్పు వస్తే చాలని, ఒక్కరైనా మారితే అదే తనకు సంతోషమని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు తరచూ చెప్తుంటారు. తాజాగా ఆయన నేటి సమాజంలో అక్రమ సంబంధాలు పెరిగిపోవడానికి, కాపురాలు కూలిపోవడానికి గల ముఖ్య కారణాలను వెల్లడించారు. గరికపాటి చేసిన ఆ ఆసక్తికర వ్యాఖ్యల వివరాలు ఇప్పుడు చూద్దాం..

**మాటల లోపమే పెద్ద సమస్య:**

నేటి సమాజంలో భార్యాభర్తల మధ్య సరైన సంభాషణ లేకపోవడమే అనేక సమస్యలకు మూలకారణమని గరికపాటి తెలిపారు. ఒకరినొకరు మనస్ఫూర్తిగా అర్థం చేసుకోకపోవడం, భావాలను పంచుకోకపోవడం వల్ల దంపతుల మధ్య దూరం పెరుగుతోందన్నారు. ఒకప్పుడు ఇంట్లో ఉంటే ఎన్నో విషయాలు మాట్లాడుకునే వారని, కానీ ఇప్పుడు ఒకే గదిలో ఉన్నా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**స్మార్ట్‌ఫోన్ల వల్లే అసలు ముప్పు:**

భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడటానికి సమయం కేటాయించకుండా, నిరంతరం సెల్ ఫోన్లకే పరిమితమవ్వడం వల్లే



కాపురాలు కూలిపోతున్నాయని గరికపాటి స్పష్టం చేశారు. ఇక చిన్న చిన్న మనస్పర్థలే ఈ ఫోన్ల గోలలో పెద్ద గొడవలుగా మారి, చివరికి కుటుంబ విచ్ఛిన్నానికి దారితీస్తున్నాయని హెచ్చరించారు. మొబైల్ వాడకం పరిమితి దాటితే జీవితంలో పరువు, ప్రశాంతత మట్టిలో కలిసిపోతాయని చెప్పారు.

**స్త్రీ ప్రకృతి స్వభావం.. ప్రేమే ఆయుధం:**

స్త్రీ అనేది ప్రకృతి స్వభావమని, ఆమె భర్త నుంచి కాస్త సమయాన్ని, ఆప్యాయతతో కూడిన కాలక్షేపాన్ని కోరుకుంటుందని ఆయన వివరించారు. కాబట్టి ప్రతి భర్తా రోజులో కొంత సమయాన్నైనా కేటాయించి భార్యతో మనసారా మాట్లాడాలని సూచించారు. ఇక సరైన సమయం ఇచ్చి ప్రేమిస్తే ఎలాంటి విభేదాలైనా తొలగిపోయి, దాంపత్య జీవితం ఎంతో హ్యాపీగా సాగుతుందని స్పష్టం చేశారు.

**నైతిక పతనానికి కారణమయ్యే సంబంధాలు:**

అక్రమ సంబంధాల వల్ల కలిగే అనర్థాలు, నైతిక పతనం గురించి కూడా ఆయన హెచ్చరించారు. తాత్కాలిక మోహాలకు లొంగిపోయి చేసుకునే ఇలాంటి దారుణమైన పొరపాట్లు కుటుంబ గౌరవాన్ని, సమాజంలో వ్యక్తిత్వాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని తెలిపారు. ఇక సమాజంలో ఇటువంటి మార్పులు రాకూడదని, ప్రతి కుటుంబం నైతిక విలువలతో నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక గరికపాటి నరసింహారావు చెప్పిన ఈ మాటలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేలా ఉన్నాయి. సెల్ ఫోన్లను పక్కనబెట్టి, కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, భార్యాభర్తలు ఒకరికొకరు ప్రాధాన్యత ఇచ్చుకున్నప్పుడే కాపురాలు నిలబడతాయి. ఆయన ప్రవచనం వల్ల సమాజంలో మార్పు వచ్చి, కుటుంబ బంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశిద్దాం.

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
• బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
• రోజువారీ తెలుగు దినపత్రిక PDF
• అంతర్జాతీయ, జాతీయ వార్తలు
• విశ్లేషణాత్మక కథనాలు
VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



ఫిర్యాదు పరిష్కారమే కాదు..

# ప్రజల సంతృప్తే పీజీఆర్ఎస్ లక్ష్యం

**ప్రతి పీజీఆర్ఎస్ కేంద్రంలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్**

**ప్రజల అభిప్రాయాలతో ప్రభుత్వ సేవల నాణ్యతను మరింత పెంచుతాం : కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సేవలపై తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేసేలా పీజీఆర్ఎస్ వ్యవస్థలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఆగస్టు 17న జిల్లాలోని అన్ని పీజీఆర్ఎస్ (రెవెన్యూ క్లినిక్) కేంద్రాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో సేవలు పొందిన ప్రజలు తమ అనుభవాన్ని నేరుగా తెలియజేసేందుకు ప్రత్యేకంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు సేవ పొందిన అనంతరం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవల నాణ్యత, అధికారుల స్పందన, సమస్య పరిష్కార విధానం తదితర అంశాలపై తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ఫీడ్‌బ్యాక్‌ను విశ్లేషించడం ద్వారా లోపాలను గుర్తించి, అవసరమైన చోట మార్పులు తీసుకురావడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రజల సంతృప్తి పరిపాలనకు ముఖ్యమైన ప్రమాణమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంతో పాటు ప్రజలు ప్రభుత్వ సేవలను ఎలా స్వీకరిస్తున్నారు, వారికి ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి అనే అంశాలను తెలుసుకోవడం ద్వారా పాలనను మరింత ప్రజలకు చేరువ చేయవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీజీఆర్ఎస్ కేంద్రాలకు రాలేని ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలను పొందవచ్చని కలెక్టర్ వెల్లడించారు. ఫిర్యాదు పరిష్కారం ఒక బాధ్యత అయితే, ప్రజల ఫీడ్‌బ్యాక్ ద్వారా సేవలను మెరుగుపరచడం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం, అభిప్రాయాలతో పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు



**అమలాపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం, సామాజిక సంస్కరణలు, రైతు సంక్షేమం, కార్మికుల హక్కులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న జీవితం స్వాతంత్ర్య పోరాటం, సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, కార్మికుల హక్కులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సాగిన నిరంతర పోరాటానికి ప్రతీక అని అన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ప్రజానాయకుడిగా చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఆర్ఐ బ్రహ్మానందం, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులర్పించారు.

పి4 స్ఫూర్తితో

# నిరుపేద ఆడపిల్లలకు అండగా డీటీఓ



**అమలాపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** తండ్రిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి పి4 స్ఫూర్తితో జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అండగా నిలిచారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకుని ముగ్గురు ఆడపిల్లలను దత్తత తీసుకుని వారి పోషణ, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కె.జగన్నాధపురానికి చెందిన పిచ్చుక సత్యనారాయణ గత నెల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య సరస్వతి మానసిక అనారోగ్యంతో బాధపడుతుండగా, వారికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. తండ్రిని కోల్పోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పి4 స్ఫూర్తితో ఆ కుటుంబానికి అండగా నిలిచి, ముగ్గురు ఆడపిల్లలను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న వెంటనే కుటుంబ పోషణకు అవసరమైన నిత్యావసర సరుకులను సమకూర్చారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి అవసరమైన వైద్యం అందించేందుకు మానసిక వైద్యశాలలో చికిత్స చేయించారు. ఆడపిల్లల చదువుపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. వారు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, పదో తరగతి చదువుతున్న విద్యార్థినుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయురాలిని కోరారు. వారి చదువుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. తన పుట్టినరోజు సందర్భంగా కూడా సేవా కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చిన డీటీఓ, పి4 స్ఫూర్తితో దత్తత తీసుకున్న ఆడపిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ముగ్గురు ఆడపిల్లలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఆడపిల్లలతో కొంత సమయం గడిపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, దత్తత తీసుకున్న రెండు నిరుపేద కుటుంబాలతో కలిసి తన పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో ఆత్మసంతృప్తిని కలిగించిందన్నారు. పుట్టినరోజు వేడుకలను వ్యక్తిగతంగా కాకుండా, అవసరాల్లో ఉన్న కుటుంబాలతో కలిసి జరుపుకోవడం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తించిన అనుభూతి కలిగిందని తెలిపారు. ప్రభుత్వ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో పి4 స్ఫూర్తిని సామాజిక బాధ్యతగా మలచుకున్నానని చెప్పారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా వారికి భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. నిరుపేద పిల్లల విద్యకు, వారి భవిష్యత్తుకు అవసరమైన సహకారం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు.

## కార్యకర్త మృతితో కదిలిపోయిన నేత

- కన్నీటి వీడ్కోలుతో పాడె మోసిన డాక్టర్ పినిపే శ్రీకాంత్



**అమలాపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పార్టీకి నమ్మకంగా పనిచేసిన అప్పారి లక్ష్మీనారాయణ అకాల మరణం అమలాపురం నియోజకవర్గంలో విషాదాన్ని నింపింది. ఆయన మృతిపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్ తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అప్పారివారిపాలెంలో లక్ష్మీనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన డాక్టర్ శ్రీకాంత్, స్వయంగా పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకుడికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ అంతిమయాత్రలో రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎస్ఈసీ సభ్యుడు కుడుపూడి బాబు, రాష్ట్ర మున్సిపల్ విభాగ కార్యదర్శి గొవ్వల రాజేష్, రాష్ట్ర లీగల్ సెల్ సంయుక్త కార్యదర్శి సుబ్బురాం, నాయకులు అంజి, శ్రీరామ్, సత్యనారాయణ మాస్టర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో

## సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు



**అమలాపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, స్వాతంత్ర్య సమరంలో ధైర్యంగా పోరాడిన ప్రజానాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఆదివారం అమలాపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజానాయకుడిగా, సామాజిక సంస్కర్తగా ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జీవితం స్వాతంత్ర్య పోరాటం, సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, కార్మికుల హక్కులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సాగిన నిరంతర పోరాటానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అందుకే ఆయనను ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ప్రజానాయకుల్లో ఒకరిగా ప్రజలు స్మరించుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఆర్ఐ బ్రహ్మానందం, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులర్పించారు.

రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణకు

## ప్రతిష్టాత్మక ‘పోలీస్ సేవా పురస్కారం’



**రామచంద్రపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రామచంద్రపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఎం.వెంకటనారాయణకు అరుదైన గౌరవం దక్కింది. శనివారం (ఆగస్టు 15) అమలాపురంలో జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో విధి నిర్వహణలో ఆయన కనబరిచిన అత్యుత్తమ ప్రతిభకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ప్రతిష్టాత్మక ‘పోలీస్ ఏ.సేవా పురస్కారం’తో సత్కరించింది. గౌరవ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అలాగే జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా సీఐ వెంకటనారాయణ ఈ పురస్కారాన్ని సగర్వంగా అందుకున్నారు. రామచంద్రపురం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన తీసుకున్న పకడ్బందీ చర్యలు, నేరాల నియంత్రణలో చూపించిన ప్రత్యేక చొరవ, అలాగే ప్రజలతో మమేకమై వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే తీరు వెంకటనారాయణ కు ఈ అవార్డు వరించడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అహర్నిశలు ప్రజా రక్షణే ధ్యేయంగా, అంకితభావంతో పనిచేస్తున్న వెంకటనారాయణ సేవలను ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమున్నత పురస్కారం దక్కడం పట్ల రామచంద్రపురం డివిజన్ పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి**

# ఆలయ అభివృద్ధికి కృషి

భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయం అభివృద్ధి పనుల నిమిత్తం ఆదివారం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, భూమిపూజలో పాల్గొని పనులు విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆలయాల అభివృద్ధి ద్వారా భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయ ప్రాంగణ విస్తరణ, భక్తుల సౌకర్యాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రజలు, దాతలు సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ గణేష్ శర్మ, సభ్యులు, అర్చకులు, కూటమి నాయకులు, భక్తులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం

# యధావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**1100 టోల్ ఫ్రీ నంబర్, మీ సేవ పోర్టల్ ద్వారా కూడా నమోదుకు అవకాశం**

**క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్పందన తెలియజేయండి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, ఆగస్టు16, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్),భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కార వేదిక(రెవెన్యూ క్లినిక్) కార్యక్రమాలు ఆగస్టు 17వ తేదీ సోమవారం జిల్లా లో యధావిధిగా నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రజా సమస్యల పరిష్కారించే ఉద్దేశంతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా స్థాయిలో ఆగస్టు 17 వ తేదీన, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలు లోను,రెవెన్యూ అంశాలపై రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం వివేకానంద హాలులోను నిర్వహించడం జరుగు తుందన్నారు.జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు అందరూ విధిగా ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసు కోవడానికి 1100 నంబర్ కు కాల్ చేసి సంప్రదించ వచ్చని,ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొంద వచ్చన్నారు. అదే విధంగా అర్జీదారులు వారి యొక్క అర్జీలు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవడానికి Meekosam. ap.gov.in వెబ్సైట్ నందు తమ అర్జీలు నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్,మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదుల ను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

కాకినాడ కలెక్టరేట్‌లో ఘనంగా

# సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ 117వ జయంతి




**కాకినాడ, ఆగస్టు16, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో ప్రతి ఒక్కరూసర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు తెలిపారు. ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్నగౌడ్ 117వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో కాకినాడ పట్టణ శాసన సభ్యులువనమాడివెంకటేశ్వరరావు,జిల్లా రెవెన్యూ అధికారి డా.డి. తిప్పేనాయక్, బీసీ సంక్షేమం సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ లక్ష్మణ్ గౌడ్ గారి జయంతికార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంశు భపరిణామన్నారు. బహుజన హక్కుల సాధన కోసం,అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం లచ్చన్న చేసిన పోరాటాలు భావి తరాలకు ఎప్పటికీ మార్గ దర్శకమని కొనియాడారు. ఉత్తర కోస్తా కళింగసీమలోని ఉద్దానం ప్రాంతం (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకా బారువ గ్రామంలో 1909 ఆగస్టు 16న సాధారణ గౌడ్ కుటుంబంలో జన్మించిన లచ్చన్న,స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారని గుర్తుచేశారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతంతా.. బడుగు బలహీన వర్గాలకి ఏదైతే ఆశయాలు ఆలోచన విధానం ఉన్నాయో.. ఇప్పుడే నెరవేరుకుంటూ ప్రభుత్వం వస్తుందన్నారు.ఇంటికి రోడ్డు లేని సమయం లో.. బయటికి వస్తే బస్సులు కూడా లేని రోజుల్లో.. రైతుల కోసం పోరాటం.. మన స్వాతంత్రం కోసంపోరాటం.. ఈ రాష్ట్ర ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే.. అది గౌతు లక్ష్మణ్ గౌడ్ అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ముందుకు తీసు కెళ్లాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ మాట్లాడుతూ రైతులు,కార్మికుల హక్కుల పరిరక్షణలో ఆయన చూపిన తెగువను ప్రశంసించారు.ప్రభుత్వ పరంగా,సామాజికంగా అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని డీఆర్వో సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఏ.శ్యామల కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస రావు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు డా.చప్పిడి వెంకటేశ్వర రావు,చొల్లంగి వేణుగోపాలరావు, బాలాజీ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంలో

# బీసీ రిజర్వేషన్లు లేనట్లే..?

చంద్రబాబు సంకేతాలు



ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యాని స్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పెరగడానికి వీలు లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారు. అయితే శనివారం నివేదిక సమర్పించిన కమిషన్ ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో నాలుగు శాతం మేర పెంపునకు ఇబ్బంది లేదని సూచించింది. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచనలో పడిందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ఎన్నికల హామీ అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది. ఇందుకు కుల గణన జరగాలి. దేశంలో 1931 తర్వాత ఎక్కడా కుల గణన చేయలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, ఈ ప్రక్రియ ముగియడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అయితే వచ్చేనెల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై విస్తృతంగా సమాలోచనలు చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోందని చెబుతున్నారు. ఇక రాజ్యాంగం ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. తెలంగాణలో కూడా బీసీ రిజర్వేషన్లు పెంచాలని చూసినా సుప్రీం కోర్టు తీర్పు కారణంగా బ్రేక్ పడింది. దీంతో అక్కడ పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించారని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులతో రిజర్వేషన్లు పెంచుకోవాలని చూసినా, అందుబాటులో ఉన్న కులాల లెక్కలతో కేవలం 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచేందుకే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానికంలో బీసీ రిజర్వేషన్లపై ఆలోచన మార్చుకున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమయ్యేలా లేదని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మోడల్ ను అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు అమలు చేయకపోయినా కూటమిలోని మూడు పార్టీలు కలిపి 34 శాతం స్థానాలలో బీసీలను పోటీపెట్టాలని భావిస్తున్నారని అంటున్నారు. శనివారం కూటమి పక్షాల నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని చెబుతున్నారు. దీంతో స్థానికంలో బీసీ రిజర్వేషన్ పెరిగే పరిస్థితి కనిపించడం లేదన్న విషయం స్పష్టం అవుతోందని అంటున్నారు.

# తొలిసారి ఈవీఎం కాదా.. బ్యాలెట్ తోనేనా?



ఏపీలో వేలాదిగా ఉన్న పంచాయతీలకు ఎన్నికలు తొందరలో జరగనున్నాయి. ప్రజా పాలన లేక ఇప్పటికే అయిదు నెలలు గడచిపోయాయి. మరో రెండు నెలలలో స్థానిక ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఎంత తొందరగా ఎన్నికలు జరిపించాలన్నది ప్రభుత్వం ఆలోచిస్తోంది. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని చూస్తోంది. ఆ దిశగా సన్నాహాలు కూడా ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాలెట్ తో ఎన్నికలు అంటూ ఇపుడు కొత్త మాట వినిపిస్తోంది. నిజానికి ఈవీఎంలు గడచిన రెండు దశాబ్దాలుగా వినియోగంలోకి వచ్చాయి. అయితే ఈసారి పంచాయతీ ఎన్నికలను కూడా బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరిపించాలని ఎన్నికల సంఘం ఆలోచన చేస్తోంది అని అంటున్నారు.

**గతంలోనూ బ్యాలెట్ పేపర్‌తోనే :**

ఇదిలా ఉంటే ఏపీలో 2021లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలని కూడా ఈవీఎంలతో నిర్వహించలేదు. వాటిని సంప్రదాయ బ్యాలెట్ పేపర్లతోనే చేపట్టారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన ఏపీ గ్రామ పంచాయతీ ఎన్నికల పూర్తి షెడ్యూల్ ప్రకారం ఓటింగ్ ప్రక్రియ అంతా బ్యాలెట్ పేపర్ల మీదే సాగింది. అదే విధంగా సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులకు బ్యాలెట్ పేపర్ పై ముద్రించిన వివిధ రకాల గుర్తులను కేటాయించారు. ఇక పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల్లోనే బ్యాలెట్ బాక్సులను తెరిచి ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు. అలాగే 2021లో ఏపీలో జరిగిన ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలు కూడా ఈవీఎంల ద్వారా జరగలేదు. ఈ ఎన్నికలను పూర్తిగా బ్యాలెట్ పేపర్లు తోనే నిర్వహించారు. ఇప్పటిదాకా ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్లు మున్సిపాలిటీ ఎన్నికలకు మాత్రమే ఈవీఎంలను ఉపయోగిస్తూ వచ్చారు.

**తొలిసారి ఈవీఎంలు అంటూ :**

ఈ నేపథ్యంలో ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికలను తొలిసారి ఈవీఎంలతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావించింది. కానీ చివరికి బ్యాలెట్ విధానానికే మొగ్గు చూపినట్లు సామాజిక మాధ్యమాలలో అయితే విస్తృత ప్రచారం జరుగుతోంది. దాంతో పాటు గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపల్ ఎన్నికలనూ బ్యాలెట్ విధానంలో నిర్వహించేందుకు ప్రణాళిక అంటూ పోస్ట్ లు వైరల్ అవుతున్నాయి. ఇక రాష్ట్రంలో అందుబాటులో లక్ష పది వేల బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. వీటిలో కూడా యాభై వేల బ్యాలెట్ బాక్స్ లు మాత్రమే వినియోగానికి చాన్స్ ఉన్నట్లుగా చెబుతునారు. ఈ క్రమంలో అదనంగా 50 వేల చొప్పున బాక్సులు సమకూర్చాలని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ఎన్నికల కమిషన్లకు అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖ రాసినట్లు సామాజిక మాధ్యమాలలో వార్తలు వస్తున్నాయి. వీటిలో నిజమెంత ఉందో తెలియదు. అయితే పంచాయతీ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తారని అంటున్నారు. గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది పడకుండా ఈ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.

గల్ఫ్ సస్పెన్స్ థ్రిల్లర్

# ఇరాన్ 'లెక్కలు'.. ఖతార్ 'ట్రిక్కులు'..



గల్ఫ్ రీజియన్‌లో శాంతి పవనాలు వీస్తున్నాయని అమాయకంగా అనుకునేలోపే.. ఊహించని ట్విస్టులతో మైండ్ బ్లాంక్ అయ్యే పొలిటికల్ థ్రిల్లర్ మూవీ కథాంశం తెరపైకి వచ్చింది. ఇరాన్-ఖతార్ ల నడుమ ఇప్పుడు నడుస్తున్నది మామూలు వివాదం కాదు.. యుద్ధ విమానాలు, మిస్సింగ్ పైలట్లు, రెడ్‌క్రాస్ సంస్థ.. పైగా అంతర్జాతీయ రాజకీయం.. కథలోకి వెళ్తే.. ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ 'ఐఆర్ఎన్ఏ' పక్కా ప్లాన్‌తో ఒక కథనాన్ని వదిలింది. మార్చిలో ఖతార్ సైనిక స్థావరంపై దాడికి వెళ్లిన మూడు ఇరాన్ యుద్ధ విమానాలు కాస్తా దెబ్బతిన్నాయని, వాటిలోని ముగ్గురు పైలట్లు సురక్షితంగా పారాచూట్ల సాయంతో బయటకు దూకి ఖతార్ బలగాలకు 'గెస్ట్‌లు'గా చిక్కారని ఇరాన్ మిలిటరీ చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పేసింది. తమ పైలట్లను సురక్షితంగా రప్పించుకోవడానికి అంతర్జాతీయ రెడ్‌క్రాస్ తలుపులు కూడా తట్టేసింది. తీరా సీన్ ఖతార్‌కి షిఫ్ట్ అయితే ఊహించని క్లైమాక్స్ మొదలైంది.. 'ముగ్గురా? అబ్బే.. మా దగ్గర అంతమంది లేరండోయ్' అంటూ ఖతార్ విదేశాంగ శాఖ సూటిగా బాంబు పేల్చింది. తమ గగనతలంలోకి వచ్చిన విమానాలను కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నిస్తే పైలట్ల నుంచి రెస్పాన్స్ లేదని.. చివరికి తాము గాలించగా కేవలం ఒకే ఒక్క పైలట్ మృతదేహం మాత్రమే దొరికిందని స్పష్టం చేసింది. 'పాపం ఆ మృతదేహాన్ని తీసుకెళ్లమని ఎంత పిలిచినా ఇరాన్ వైపు నుంచి స్పందనే లేదు' అని ఇంకో మెలిక పెట్టింది. ఇక్కడే అసలు కామెడీ.. సస్పెన్స్ మొదలయ్యాయి.. ఇరాన్ లెక్కల ప్రకారం ముగ్గురు పైలట్లు ఖతార్ రిసార్ట్‌లలో చిల్ అవుతున్నారు. ఖతార్ లెక్క ప్రకారం దొరికింది ఒక్కరే.. అదీ ప్రాణాలతో లేరు. మరి మిగిలిన ఇద్దరు పైలట్లు ఎక్కడికి మాయమైనట్టు? పారాచూట్ దారి తప్పి వేరే దేశంలో ల్యాండ్ అయ్యారా? లేక ఈ అంతర్జాతీయ పజిల్ వెనుక ఇంకేదైనా మిస్సింగ్ పీస్ ఉందా అనేది అసలైన మిలియన్ డాలర్ల ప్రశ్న. అప్పటికే అమెరికా, ఇజ్రాయెల్ పంచాయతీలతో గల్ఫ్ ప్రాంతం సెగలు కక్కుతోంది. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ కన్నెర్ర చేయడం పాత కథే అయినా ఇప్పుడు ఖతార్ ఆకాశంలో పైలట్ల అదృశ్యం కొత్త రచ్చకు దారితీసింది. 'ముగ్గురు' అని ఇరాన్.. 'ఒక్కడే' అని ఖతార్ పొడుస్తున్న ఈ వింత పొడుపు కథకు క్లైమాక్స్ ఎప్పుడు పడుతుందో, ఆ మిస్సింగ్ పైలట్లు ఎప్పుడు బయటపడతారో అని గల్ఫ్ జనాలు పాప్‌కార్న్ తింటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి

**రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్**

**వై-జంక్షన్ వద్ద 117వ జయంతి సందర్భంగా ఘన నివాళులు**





**రాజమహేంద్రవరం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య సమర యోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ మంత్రి సర్ధార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు రాజమహేంద్రవరం వై-జంక్షన్ వద్ద నున్న ఆయన విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంస్య విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నగర గౌడ, శెట్టిబలిజ సంఘం గౌరవ అధ్యక్షులు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షులు రెడ్డి రాజు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు సూరంపూడి శ్రీహరి, మార్గాని చంటిబాబు, ఇతర కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైసిపి అమలాపురం పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, బీసీ జేఏసీ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, జనసేన సిటీ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, వైసిపి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, ఎఎంసి చైర్మన్ మార్ని వాసుదేవ్, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, బిసివై పార్టీ పిఎసి సభ్యుడు అత్తిలి రాజు, ఇతర నాయకులు కొండేటి భీమారావు, పిల్లి నిర్మల, గుమ్మడి సమర్పణరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, సానబోయిన రామారావు, చెల్లుబోయిన శ్రీనివాస్, జార్జ్ అంథోని, కడలి రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు. ఆనాడు జాతిపిత మహాత్మాగాంధీ పిలుపును అందుకున్న స్వాతంత్ర్య సమరోద్యంలో ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. బడుగు, బలహీన వర్గాలు, హరిజనుల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ పిలుపు అందుకున్న నాయకుడు గౌతు లచ్చన్న మాత్రమేనని తెలిపారు. ఆయన స్ఫూర్తితో నేటి తరం రాజకీయ నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత సామాజిక వర్గాల మధ్య ఐక్యత సాధించడానికి అనునిత్యం కృషిచేసారని ప్రశంసించారు. అటువంటి మహనీయుడి ఆశయ సాధనకు అందరూ పునరంకితం కావాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన జయంతిని అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని బుడ్డిగ శ్రీనివాస్ వెల్లడించారు. అది గౌతు లచ్చన్నతో పాటు తమ సామాజిక వర్గాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు గేడి అన్నపూర్ణ రాజు, కోశాధికారి గెద్దాడ హరిబాబు, వనుము శ్రీనివాస్, రేలంగి శేఖర్, సంఘం పెద్దలు కడియాల వరబాబు, శీలం గోవింద్, కుడుపూడి పార్ధసారధి, అనుసూరి పద్మలత, గొర్రెల రమణ, పెంకే సురేష్, సూరంపూడి అప్పారావు, సూరంపూడి రాజేంద్ర, కడలి చిన్న, గుత్తుల రామచంద్రరావు, కట్టా మల్లేశ్వరరావు, కడలి కెరటాలు, టేకుమూడి బద్రీనాథ్, సూరంపూడి వీరవెంకట రావు, మార్కొండ సుబ్రహ్మణ్యం, కార్పొరేషన్ డైరెక్టర్లు యామన నారాయణ గౌడ్, పిల్లి వెంకట రమణ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎపి రాష్ట్ర నాట్య అకాడమీ డైరెక్టర్

# మద్దాల యేసుపాదంకు ఘన సత్కారం

**కార్యక్రమంలో పాల్గొన్న రాజా నగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి**



**సీతానగరం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాట్య అకాడమీ డైరెక్టర్‌గా సీతానగరం మండలానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు మద్దాల యేసు పాదం నియమితులైన సందర్భంగా సీతానగరం మండలంలోని జీవీకే ఫంక్షన్ హాల్ నందు ఆత్మీయ సమావేశం ఘనం గా నిర్వహించబడింది. ఈ వేడుకకు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యు లు బత్తుల బలరామకృష్ణ, వారి సతీమణి బత్తుల వెంక టలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భ ర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మద్దా ల యేసుపాదంను బత్తుల బలరామకృష్ణ దంపతులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ బలో పేతానికి, సిద్ధాంతాల వ్యాప్తి కి నిరంతరం శ్రమించిన సీని యర్ నాయకులు మద్దాల యేసుపాదం సేవలకు తగిన గుర్తింపు లభించిందని ప్రజా క్షేత్రంలో ఆయన చేసిన కృషికి ప్రతిఫలంగానే కూటమి ప్రభుత్వంలో వారికి ఈ బాధ్యత దక్కిందన్నారు. నాట్య అకాడమీ డైరెక్టర్‌గా కళలకు, కళాకారులకు పూర్తిస్థా యిలో సేవలు అందిస్తూ, నియోజకవర్గానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నానని అన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినం దుకు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, కూటమి పెద్ద లకు మరియు తనకు నిరంతరం అండగా నిలిచిన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ కు మద్దాల యేసుపాదం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యేసుపాదంకు అభినందనలు తెలిపారు.

సినీ జూనియర్ ఆర్టిస్ట్, సీనియర్ ఫోటోగ్రాఫర్

# పైల సత్యనారాయణ (కుమార్) మృతి



**- పలువురు ప్రగాఢ సంతాపం**

**కోరుకొండ, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ సినీ జూనియర్ ఆర్టిస్ట్, కోరుకొండ మండలం సీనియర్ ఫోటోగ్రాఫర్ పైల సత్యనారాయణ(72) కుమార్ గుండెపోటుతో ఆకస్మితంగా మృతి చెందారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనార్థం వెళుతున్న సమయంలో విజయవాడ దగ్గర ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కోరుకొండ స్వగ్రాన్ని తీసుకురాగా, పలువురు ఎన్డీఏ నాయకులు, నరసన్న భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాజమహేంద్రవరం నుండి సినీ జూనియర్ ఆర్టిస్టులు, తదితరులు పెద్ద ఎత్తున విచ్చేసి ఆయనకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన సినిమా రంగంలో రాజమండ్రి గోదావరి పరిశ్రమ ప్రాంతాల్లో ముందుగా పరిసరాలను చూడడానికి, ఆర్టిస్టులను తీసుకురావడం విషయంలోనూ సినీ రంగానికి విశేషంగా కృషి చేస్తారు. సినీ రంగంలో పలు పాత్రలను పోషిస్తూ, నాటక రంగంలోనూ మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారు. అదేవిధంగా కోరుకొండ మండలంలో ఫోటోగ్రాఫర్ గా పరిసర ప్రాంతాల ప్రజలతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. కోరుకొండ యూనియన్ అభివృద్ధికి అయినా పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి సినీ రంగానికి, ఫోటోగ్రఫీ రంగానికి తీరనిలోటుని పలువురు తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ కైలాభూమిలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

# ప్రియాంకకు నివాళుల పేరుతో రాజకీయం చేశారు

**విద్యాసంస్థలు రాజకీయాలకు అతీతం.. - అనవసరంగా రాజకీయాల్లోకి లాగొద్దు - సాయి నర్సింగ్ కళాశాల అధినేత డీవీ సుబ్బారావు**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న మెడికో ప్రియాంక మృతి ఘటన నేపథ్యంలో ఆమెకు నివాళులు అర్పించేందుకు తమ కళాశాల విద్యార్థినులను పంపాలని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, ఆయన కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా కోరినట్లు సాయి నర్సింగ్ కళాశాల అధినేత డీవీ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు పత్రిక ప్రకటన, ఒక వీడియో విడుదల చేశారు. నివాళుల కార్యక్రమం పేరుతో విద్యార్థినులను అక్కడికి పంపిన విషయం తనకు ముందుగా తెలియదని, తనను సంప్రదిం చకుండానే కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను పంపడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రియాంక మృతి పట్ల సానుభూతితో ఆమెకు నివాళులు అర్పించేందుకు విద్యార్థినులను పంపాలని కోరడంతోనే తమ కళాశాల ప్రిన్సిపాల్ చెప్పారని డీవీ సుబ్బారావు తెలిపారు. అయితే అక్కడికి వెళ్లిన అనంతరం విద్యార్థి నులకు ప్లకార్డులు, క్యాండిల్స్ అందించి కార్య క్రమానికి రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు. మృతురాలికి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ముగించి ఉంటే ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదని పేర్కొన్నారు.

**"మా కళాశాల రాజకీయాలకు పూర్తిగా అతీతం"**

తమ విద్యాసంస్థలు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కానీ, వ్యతిరేకంగా కానీ వ్యవహరించవని డీవీ సుబ్బారావు స్పష్టం చేశారు. తాము ఒక స్వచ్ఛంద సంస్థగా, విద్యాసంస్థగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గానీ, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ తమ సంస్థ వ్యవహరించదన్నారు. అయితే ప్రిన్సిపాల్ స్థాయిలో మాజీ ఎంపీ వంటి ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి వచ్చిన విజ్ఞప్తికి గౌరవం ఇచ్చి విద్యార్థినులను పంపించి ఉండవచ్చని తెలిపారు.

**విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించొద్దు**

ప్రియాంక మృతి పట్ల తమకు కూడా సానుభూతి ఉందని, ఆమెకు నివాళులు అర్పించడాన్ని తాము తప్పుపట్టడం లేదని డీవీ సుబ్బారావు తెలిపారు. అయితే సానుభూతి కార్యక్రమాన్ని రాజకీయ కార్యక్రమంగా మార్చి విద్యార్థులకు ప్లకార్డులు, క్యాండిల్స్ అందించి రాజకీయ నినాదాలు లేదా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం మాత్రం సరికాదన్నారు. "మమ్మల్ని ఎవ్వరినీ రాజకీయాల్లోకి లాగవద్దు... మా విద్యార్థులకు, విద్యాసంస్థలకు రాజకీయ రంగు పులమవద్దు... మేము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నాం... మా పిల్లలను కూడా రాజకీయాలకు దూరంగా ఉంచాలను కుంటున్నాం" అని డీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

**మా విషయంలో కూడా అదే జరిగింది**

**- ప్రియదర్శిని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా కుమారి**

సాయి నర్సింగ్ కళాశాలకు జరిగిన మాదిరిగానే తమ కళాశాలకు జరిగిందని ప్రియదర్శిని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ ఎస్ రాధా కుమారి తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులను కూడా కార్యక్రమానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలను రాజకీయాలకు వేదికలుగా మార్చకుండా అన్ని రాజకీయ పక్షాలు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. ప్రియాంక మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేయడం, నివాళులు అర్పించడం వరకు మాత్రమే కార్యక్రమాన్ని పరిమితం చేసి ఉంటే బాగుండేదని, అనవసరంగా విద్యార్థులను రాజకీయ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వల్ల విద్యాసంస్థల ప్రతిష్ఠకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, విద్యాసంస్థలకు రాజకీయ రంగు పులమకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

పదవ తరగతి ర్యాంకర్ విద్యార్థికి

# గ్రామస్తుల ప్రశంసలు



**గోకవరం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలంలో రంప ఎర్రం పాలెం గ్రామానికి చెందిన బాణాల గౌతమ్ పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ఆగస్టు 15న గ్లోబల్ ఆలుమ్ని వెల్ఫేర్ ట్రస్ట్ (స్కూల్ మేట్స్), రంప యర్రంపాలెం గ్రామస్తులు గౌతమ్ కి 10,000 రూ. నగదు బహుమతిని అందజేశారు. చదువు పట్ల శ్రద్ధ పెద్దల పట్ల వినయం గా ఉంటూ మంచి మార్కులు తెచ్చుకున్న గౌతమ్ ని గ్రామస్తులు శుభాకాంక్షలు తెలుపుతూ. వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**గోకవరం, ఆగస్టు 16, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు ఆదివారం ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్సై బి. నాగమణి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వి.ఎన్.వి. పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రంపచోడవరం పరిసరాల్లోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపరిచి న్యాయస్థానం ఆదేశాల మేరకు జరిమానా, జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి వాహనదారులతో పాటు అమాయకుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకుండా, రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

**నలుగురిపై కేసులు నమోదు**





పాన్ మసాలాలపై ప్రచారం..

# బాలీవుడ్ స్టార్ హీరోలకు నోటీసులు



పాన్‌మసాలా ప్రకటనల్లో నటించిన బాలీవుడ్ నటులు షారుక్ ఖాన్, అజయ్ దేవ్‌గన్, టైగర్ ష్రాఫ్‌లకు షాక్ తగిలింది. ఈ విషయంపై ముగ్గురు స్టార్లకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరి ఈ నోటీసులపై ఈ ముగ్గురు స్టార్స్ ఎలా స్పందిస్తారో చూడాలి. కోట్లాది మంది అభిమానులు, అనుచరులు ఉన్న సినీ నటీనటులు పాన్ మసాలా, గుట్కా, మద్యం వంటి అనారోగ్యకరమైన ఉత్పత్తుల గురించి ప్రచారం చేయడం సరికాదన్న వాదన చాలా సంవత్సరాలుగా ఉంది. అయితే కొన్ని గుట్కా కంపెనీలు మాత్రం తమ ఉత్పత్తులను ప్రచారం చేయించడానికి భారతదేశంలోని పెద్ద స్టార్ నటులనే కాకుండా, హాలీవుడ్ స్టార్ నటులను కూడా తీసుకువస్తాయి. ఇప్పుడు షారుఖ్ ఖాన్, అజయ్ దేవగన్, టైగర్ ష్రాఫ్ వంటి భారతీయ సూపర్‌స్టార్లు, మరికొందరు స్టార్ నటులు పాన్ మసాలా యాడ్లలో నటిస్తున్నారు. ఇప్పుడు ఆ స్టార్లకు మహారాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. 'విమల్' ప్రకటనలో నటించినందుకు గానూ బాలీవుడ్ నటులు అజయ్ దేవ్‌గన్, షారుఖ్ ఖాన్, టైగర్ ష్రాఫ్‌లకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ షోకాజ్ నోటీసు జారీ చేసింది. రాష్ట్రంలో నిషేధించబడిన 'విమల్ పాన్ మసాలా' ఉత్పత్తికి ఇది పరోక్ష ప్రచారంగా పరిగణించబడుతుందని ఖీణా తెలిపింది. మహారాష్ట్రలో పొగాకు, పాన్ మసాలా అమ్మకాల విక్రయాలు, ప్రచారంపై మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇలా ఇప్పుడు ఈ ముగ్గురు స్టార్ హీరోలు కూడా ఖీణా సంస్థ పరిశీలనలో ఉన్నారు. తమపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని హీరోలకు నోటీసులు జారీ చేశారు. గుట్కా, పొగాకు ప్రకటనలలో తమ పాత్రలపై వివరణ ఇవ్వాలని అజయ్ దేవ్‌గన్, షారుఖ్ ఖాన్, టైగర్ ష్రాఫ్‌లను కోరారు. ఈ నటులు ఇప్పుడు నటిస్తున్న 'విమల్ ఏలకుల' ప్రకటన, 'విమల్ పాన్ మసాలా' బ్రాండ్‌తో సంబంధాన్ని ఏర్పరుస్తోందని, ఇది ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం పరోక్ష ప్రకటన కిందకు వస్తుందని ఎఫ్‌డిఎ పేర్కొంది. "సదరు ప్రకటనను పరిశీలించిన మీదట, ఆ ప్రకటన ప్రధానంగా పాన్ మసాలాతో సంబంధం ఉన్న 'విమల్' బ్రాండ్‌ను ప్రచారం చేస్తున్నట్లు తేలింది. జూలై 13, 2026న ఆహార భద్రతా కమిషనర్ జారీ చేసిన నిషేధ ఉత్తర్వు ప్రకారం, మహారాష్ట్ర రాష్ట్రంలో పాన్ మసాలా తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ, అమ్మకాలు ఒక సంవత్సరం పాటు నిషేధించబడ్డాయి. మహారాష్ట్రలో 2012 నుంచి పొగాకు లేదా నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం ఉంది. కమిషనర్ తుకారాం ముండే నాయకత్వంలో మహారాష్ట్ర ఎఫ్‌డిఎ పొగాకు అమ్మకాలు, ప్రచారంపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇక విమల్ పాన్ మసాలా వంటి పరోక్ష ప్రకటనలకు సంబంధించి ఎఫ్‌డిఎ మొదటిసారిగా ఈ కేసును విచారిస్తోంది. అజయ్ దేవ్‌గన్, షారుఖ్ ఖాన్, టైగర్ ష్రాఫ్ ఈ ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారు.

# రవితేజ ఇరుముడి 'మల్లెపూల పల్లకి' సాంగ్ వచ్చేసింది..



మాస్ మహరాజా రవితేజ తన పంథాకు భిన్నంగా నటిస్తోన్న చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో 'అయ్యప్ప స్వామి' నేపథ్యం కూడా ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి 'మల్లెపూల పల్లకి' సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. రవితేజ, శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న 'ఇరుముడి' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన టీజర్స్, ట్రైలర్ సినీ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ట్రైలర్ రిలీజైన తర్వాత ఇరుముడి సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యింది. ఇప్పుడు దీనిని కొనసాగిస్తూ అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న ది మోస్ట్ అవైటెడ్ సాంగ్ 'మల్లెపూల పల్లకి ' పాటను రిలీజ్ చేశారు మేకర్స్. ఆదివారం (ఆగస్టు16) రాత్రి ఇరుముడి సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్ జరగ్గా, ఈ వేడుకలోనే ఈ అయ్యప్ప స్వామి పాటను విడుదల చేశారు మేకర్స్. ఆంధ్రప్రదేశ్ కు చెందిన అయ్యప్ప స్వామి సాంగ్స్ స్పెషలిస్ట్ డప్పు శ్రీను ఈ పాటను అద్భుతంగా ఆలపించారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చారు. అలాగే చౌడం శ్రీనివాసరావు (వాసు) అందించిన సాహిత్యం పాటను ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. ఇక ప్రముఖ డాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ అందించిన జానపద.. భక్తి శైలి స్టెప్పులకు రవితేజ తనదైన శైలి మాస్ గ్రేస్‌తో ప్రాణం పోశాడు. కొద్ది నిమిషాల క్రితమే రిలీజైన ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా భారీ వ్యూస్ రాబడుతోంది. కాగా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇరుముడి సినిమాను నిర్మిస్తున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో రవిజేత కూతురిగా నక్షత్ర అనే ఓ చిన్నారి నటిస్తోంది. కాగా ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ శుక్రవారం (ఆగస్టు 21)న ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొన్నేళ్లుగా వరుస అపజయాలతో సతమతవుతోన్న రవితేజకు ఇరుముడి గ్రేట్ కమ్ బ్యాక్ మూవీ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఆమె వ్యాఖ్యలు నా వ్యక్తిత్వాన్ని మార్చలేవు..

## రష్మిక కామెంట్స్‌పై స్పందించిన 'టాక్సిక్' హీరో యష్





కొన్ని సంవత్సరాల క్రితం యశ్ ను ఉద్దేశిస్తూ రష్మిక మందన్న చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి కారణమయ్యాయి. అప్పట్లో యష్ అభిమానులు కూడా రష్మిక కామెంట్స్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇన్నేళ్ల తర్వాత యశ్ రష్మిక కామెంట్స్ పై తన మౌనాన్ని వీడాడు. కన్నడ సినిమా ఇండస్ట్రీకి చెందిన రష్మిక మందన్నా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో ఫేమస్ అయిపోయింది. నేషనల్ క్రష్ గా అందరి మన్ననలు అందుకుంటోంది. అయితే గతంలో రాకింగ్ స్టార్ యశ్‌ను 'మిస్టర్ షో -ఆఫ్' అని పిలవడం తీవ్ర చర్చనీయాంశమైంది. 2016లో 'కిరిక్ పార్టీ' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె ఆ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఒక ఇంటర్వ్యూకు హాజరైంది. ఇదే క్రమంలో హీరో యశ్ పై కామెంట్స్ చేసి వివాదంలో చిక్కుకుంది రష్మిక. యశ్ అభిమానులు కూడా రష్మికపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ విషయం తీవ్రరూపం దాల్చడంతో, రష్మిక బహిరంగంగా క్షమాపణ చెప్పి, తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చింది. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది. అయితే తనపై రష్మిక చేసిన కామెంట్స్ పై ఇప్పటివరకు స్పందించలేదు యశ్. అయితే తాజాగా టాక్సిక్ ప్రమోషన్లలో భాగంగా వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తోన్న రాకింగ్ స్టార్ రష్మిక కామెంట్స్ పై స్పందించాడు. 'మా గురించి ఎవరైనా అభిప్రాయం చెప్పవచ్చు. కానీ ఒకరి అభిప్రాయం నా వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేదు. నేను ఎలా ఉన్నా, ఇతరుల దృక్కోణం వల్ల అది మారదు. ఆమె ఏ ఉద్దేశంతో అలా అన్నారో నాకు తెలియదు. అప్పట్లో తను సినిమా ఇండస్ట్రీకి కొత్త. కొన్ని టీవీ షోలలో యాంకర్లు 3-4 ఆప్షన్లు ఇచ్చి ఏదో ఒకటి ఎంచుకోమంటారు. ఆ ఆప్షన్లలో నాకు ఇది సరిపోతుందని రష్మిక భావించి ఉండొచ్చు. నేను మాత్రం పెద్దగా పట్టించుకోలేదు. ఎవరి అభిప్రాయం వాళ్లది' అని యశ్ చెప్పుకొచ్చారు. కాగా రష్మిక కామెంట్స్ తర్వాత యష్ అభిమానులు సోషల్ మీడియాలో ఆమెను బాగా ట్రోల్ చేశారు. దీనిపై కూడా స్పందించిన రాకింగ్ స్టార్ ఫ్యాన్స్ కు ఒక మంచి సందేశం ఇచ్చాడు. 'మీరు మరో నటుడిని లేదా నటిని గౌరవించకపోతే, మీరు నా అభిమాని కాలేరు' అని చెప్పుకొచ్చారు టాక్సిక్ హీరో. ఇక 'టాక్సిక్' సినిమా విషయానికి వస్తే.. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 26న విడుదల కానుంది. ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. ఇందులో యశ్ సరసన నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ ప్రధాన పాత్రల్లో నటించారు. కేవీఎన్ యష్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.




# ఆసీస్ గడ్డపై బంగ్లాదేశ్ సరికొత్త హిస్టరీ..

## 31 ఏళ్ల రికార్డులు బద్దలు.. కమిన్స్ పేరిట చెత్త రికార్డ్!




టెస్ట్ క్రికెట్‌లో పసికూనగా భావించే బంగ్లాదేశ్ సాధించిన ఈ చారిత్రక విజయం యావత్ క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. రాబోయే రెండో టెస్టులో కమిన్స్ సేన ఈ అవమాన భారం నుంచి తేరుకుంటుందో లేక బంగ్లా పులులు వైట్‌వాష్ దిశగా మరో సంచలనం సృష్టిస్తాయో వేచి చూడాలి. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఎవరూ ఊహించని మహా సంచలనం నమోదైంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాను పసికూన బంగ్లాదేశ్ ఏకంగా తొమ్మిది వికెట్ల తేడాతో చిత్తు చేసి కొత్త అధ్యాయానికి తెరతీసింది. కంగారూల అహంకారాన్ని దెబ్బతీస్తూ 31 ఏళ్ల రికార్డులను తిరగరాసిన బంగ్లా పులులు, ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఖాతాలో అత్యంత అవమానకరమైన రికార్డులను మూటగట్టాయి.

**డార్విన్ వేదికగా అద్భుతం.. తొమ్మిది వికెట్లతో ఘనవిజయం..**

డార్విన్ వేదికగా జరిగిన తొలి టెస్టు పోరులో బంగ్లాదేశ్ జట్టు సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లా పేసర్ హసన్ మహ్మద్ ధాటికి కకావికలమైంది. హసన్ ఏకంగా 55 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి ఆసీస్ వెన్నువిరిచాడు. స్టీవ్ స్మిత్ మినహా మిగిలిన స్టార్ బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తరఫున తాంజిద్ హసన్ ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించిన తొలి బంగ్లా బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ 66 పరుగులిచ్చి 5 వికెట్లతో ఆసీస్ పని పట్టాడు. చివరకు నిర్దేశించిన కేవలం 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ కేవలం ఒకే వికెట్ కోల్పోయి సునాయాసంగా ఛేదించి 1-0తో సిరీస్‌లో ముందంజ వేసింది.

**31 ఏళ్ల తర్వాత ఘోర పరాభవం.. బద్దలైన భారత రికార్డులు..**

ఈ అద్భుత విజయంతో ఆస్ట్రేలియా గడ్డపై ఎన్నో అరుదైన రికార్డులు నమోదయ్యాయి. 1995లో పాకిస్థాన్ చేతిలో ఓడిన తర్వాత, గత 31 ఏళ్ల కాలంలో ఆస్ట్రేలియా తమ స్వదేశంలో భారత్ చేతిలో తప్ప మరే ఇతర ఆసియా జట్టు చేతిలోనూ టెస్ట్ మ్యాచ్ ఓడిపోలేదు. ఆ సుదీర్ఘ చరిత్రకు బంగ్లాదేశ్ నేడు తెరదించింది. అంతేకాకుండా ఆసీస్ నేలపై అత్యంత వేగంగా తొలి విజయం నమోదు చేసిన ఆసియా జట్టుగా బంగ్లా సరికొత్త రికార్డు సృష్టించింది. గతంలో పాకిస్థాన్ తమ ఏడో ప్రయత్నంలో, భారత్ తమ 12వ పర్యటనలో తొలి విజయాన్ని అందుకోగా.. బంగ్లాదేశ్ కేవలం మూడు టెస్టుల్లోనే ఈ అపూర్వ ఘనతను సాధించి భారత రికార్డును అధిగమించింది. వికెట్ల పరంగా చూస్తే, ఆసీస్ గడ్డపై ఆసియా జట్టు సాధించిన అతిపెద్ద విజయం ఇదే. 2020లో మెల్‌బోర్న్‌లో భారత్ 8 వికెట్లతో గెలవగా, బంగ్లాదేశ్ ఏకంగా 9 వికెట్లతో విజయం సాధించి సరికొత్త మైలురాయిని నెలకొల్పింది.

**కమిన్స్ పేరిట అత్యంత చెత్త రికార్డు.. పాయింట్ల పట్టికలో దూకుడు..**

ఈ ఘోర పరాజయంతో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఓ అవాంఛిత రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సొంతగడ్డపై రెండు వేర్వేరు ఆసియా జట్ల చేతిలో (2024లో భారత్ చేతిలో, 2026లో బంగ్లాదేశ్ చేతిలో) టెస్టు మ్యాచ్ ఓడిపోయిన తొలి ఆస్ట్రేలియా కెప్టెన్‌గా కమిన్స్ నిలిచాడు. ఈ ఓటమి ఆసీస్ ఆధిపత్యానికి గట్టి చెంపపెట్టుగా మారింది.

# క్రికెట్ హిస్టరీలోనే అత్యంత చెత్త ఓటమి..

## పరువు పోయేలా ఉంది, ఆ ఇద్దరిని పీకేయండి




చారిత్రక విజయంతో బంగ్లాదేశ్ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండగా, విమర్శల సుడిగుండంలో చిక్కుకున్న ఆస్ట్రేలియాకు రెండో టెస్టు చావో రేవో లాంటిది. సొంతగడ్డపై పరువు దక్కించుకుని సిరీస్ సమం చేయాలంటే కంగారూలు తమ బ్యాటింగ్ లోపాలను వెంటనే సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ఎదురైన ఘోర పరాభవం క్రీడా ప్రపంచాన్ని కుదిపేస్తోంది. డార్విన్ వేదికగా బంగ్లాదేశ్ చేతిలో ఎదురైన చారిత్రక ఓటమితో కంగారూల మాజీ దిగ్గజాలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. రిక్కీ పాంటింగ్, మాథ్యూ హేడెన్ లాంటి మాజీలు ప్రస్తుత జట్టు తీరుపై నిప్పులు చెరిగారు. ఏకంగా జట్టును సమూలంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**బంగ్లా సంచలనం.. బద్దలైన ఆసియా జట్ల రికార్డులు..**

క్రికెట్ ప్రపంచంలో ఆస్ట్రేలియా జట్టుకు ఉన్న ఆధిపత్యం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తమ సొంతగడ్డపై వారిని ఓడించడం ఏ అగ్రశ్రేణి జట్టుకైనా ఓ పీడకల లాంటిదే. అలాంటి కఠినమైన పిచ్‌లపై బంగ్లాదేశ్ సృష్టించిన సంచలనం ఇప్పుడు క్రీడా లోకంలో పెను ప్రకంపనలు రేపుతోంది. డార్విన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ సృష్టించిన సునామీకి ఆస్ట్రేలియా పరువు గంగపాలైంది. మెహదీ హసన్ మిరాజ్, హసన్ మహ్మద్ అద్భుత బౌలింగ్ ధాటికి ఆసీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఫలితంగా బంగ్లాదేశ్ 9 వికెట్ల తేడాతో చారిత్రక విజయాన్ని నమోదు చేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ గెలుపుతో బంగ్లా జట్టు సరికొత్త చరిత్ర లిఖించింది. ఆస్ట్రేలియా గడ్డపై అతి తక్కువ మ్యాచ్‌ల్లోనే తొలి విజయం సాధించిన ఆసియా జట్టుగా రికార్డులకెక్కింది. కంగారూల ఇలాకాలో బోణీ కొట్టేందుకు బంగ్లాదేశ్‌కు కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే పట్టాయి. గతంలో పాకిస్థాన్ తమ ఏడో మ్యాచ్‌లో తొలి గెలుపును అందుకోగా, భారత్ 12వ మ్యాచ్‌లో తొలి విజయం సాధించింది. ఇక శ్రీలంక ఇప్పటివరకు 15 మ్యాచ్‌లు ఆడినా ఆసీస్ గడ్డపై ఒక్క గెలుపు కూడా నమోదు చేయలేకపోయింది. ఈ లెక్కలు చూస్తే బంగ్లాదేశ్ సాధించిన ఘనత ఎంత గొప్పదో సులభంగా అర్థమవుతుంది.

**అత్యంత అవమానకరం.. పాంటింగ్ ఫైర్**

సొంత ప్రేక్షకుల మధ్య పసికూన చేతిలో ఓడిపోవడంపై ఆసీస్ మాజీ కెప్టెన్ రిక్కీ పాంటింగ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. ఆస్ట్రేలియా క్రికెట్‌కు ఇదొక అత్యంత అవమానకరమైన ఓటమని అభివర్ణించాడు. పాట్ కమిన్స్ సారథ్యంలోని జట్టు ప్రదర్శనపై నిరాశ వ్యక్తం చేస్తూ, జట్టులో తక్షణమే మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కుండబద్దలు కొట్టాడు. సాధారణంగా తాను ఆటగాళ్లను తప్పించే విధానానికి వ్యతిరేకమని పాంటింగ్ స్పష్టం చేశాడు. నాయకుడిగా జట్టును ఎప్పుడూ ఏకతాటిపై నడిపించడానికే ప్రాధాన్యత ఇస్తానని చెప్పుకొచ్చాడు. పరిస్థితులు పూర్తిగా చేయిదాటితే తప్ప ఆటగాళ్లపై వేటు వేయాలని తాను కోరుకోనని తెలిపాడు. డార్విన్ టెస్టుకు ముందే ఆసీస్ ఓపెనర్, నంబర్ 3 స్థానాల్లో మార్పులు చేసినా పెద్దగా నష్టం ఉండదని తాను భావించినట్లు పాంటింగ్ గుర్తుచేశాడు. తాజా పరాభవంతో జట్టు ప్రక్షాళన ఇక ఏమాత్రం వాయిదా వేయకూడదని ఆయన క్రికెట్ ఆస్ట్రేలియాకు గట్టి వార్నింగ్ ఇచ్చాడు.

**హేడెన్ సూచనలు.. బ్యాటింగ్ ఆర్డర్ మారాల్సిందే..!**

మరో ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సైతం బ్యాటింగ్ ఆర్డర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో సత్తా చాటుతున్న యువ ఆటగాళ్లు సామ్ కోన్‌స్టాస్, మ్యాట్ రెన్‌షాలకు వెంటనే తుది జట్టులో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశాడు. ప్రస్తుతం బ్యాటింగ్ లైనప్ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించాడు. డాషింగ్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ను ఓపెనర్‌గా పంపడం ఏమాత్రం సరైన నిర్ణయం కాదని హేడెన్ అభిప్రాయపడ్డాడు. అతడికి ఐదో స్థానం కచ్చితంగా సరిపోతుందని సూచించాడు. అదే సమయంలో వికెట్ కీపర్ అలెక్స్ క్యారీని ఐదో నంబర్‌లో ఆడించడం తనకు అస్సలు నచ్చలేదని స్పష్టం చేశాడు. వరుస విమర్శల నడుమ ఆస్ట్రేలియా జట్టు తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. ఈ రెండు జట్ల మధ్య ఆగస్టు 22 నుంచి మెకే లోని గ్రేట్ బారియర్ రీఫ్ ఎరీనా వేదికగా రెండో టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో కంగారూలు ఎలా బదులిస్తారన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com